క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

రాచర్ల: మండలంలోని అనుమలవీడు, ఒబుల్ రెడ్డిపల్లె గ్రామాల్లో గురువారం ఉదయం 11 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ యేలం మురళీకృష్ణ బుధవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యతిథిగా ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు హాజరవుతారని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి మండలంలోని జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆరు వాహనాలపై కేసులు నమోదు



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న అధికారులు

పొదిలి: స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ జె.సుందరరావు, దర్శి ఎంవీఐ ఆధ్వర్యంలో బుధవారం ఆటోలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పలు రోడ్లలో ఆటోలను తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్, పర్మిట్లు లేని ఆటోలు, ఓవర్ లోడ్‌తో ప్రయాణిస్తున్న వాహనాల యజమానులపై కేసులు నమోదు చేశారు. ఓన్ నంబర్ ప్లేటు కలిగి ఉండి, బాడుగగు తిప్పుతున్న కారుపైనా కేసు నమోదు చేశారు. ఆరు వాహనాలను సీజ్ చేసి ఆర్టీసీ గ్యారేజీలో ఉంచారు. రూ.60 వేల జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి ఆలయంలో అన్నదానం



పొదిలి: అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఆలయం వద్ద 45 వారాలపాటు ప్రతి బుధవారం అన్నదానం చేయాలని కమిటీ సభ్యులు తీర్మానించారు. ఈ మేరకు అన్నదాన కార్యక్రమాన్ని బుధవారం నిర్వాహకులు ప్రారంభించారు. భక్తులు, దాతల సహకారంతో కార్యక్రమం చేపడుతున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు ఒక వారం అన్నదానానికి రూ.5 వేలు విరాళం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆయల పూజారి మురళీచార్యులు, వాసు, గురుస్వాములు అప్పల శంకర్, యక్కలి శేషగిరిరావు, జి.చెన్నారెడ్డి, పునుగుపాటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సగిలేరు వాగుపై అసత్య ప్రచారం వద్దు

గిద్దలూరు రూరల్: సగిలేరు వాగు అభివృద్ధిపై అసత్య ప్రచారాలతో రాజకీయాలు చేయడం సరైన పద్ధతి కాదని వైఎస్సార్ సీపీ నాయకుడు పిడతల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణంలోని సగిలేరు వాగు అభివృద్ధి కోసం గత ప్రభుత్వంలో రూ.14.52 కోట్లు నిధులు మంజూరు చేయించామంటూ చెప్పుకుంటున్న టీడీపీ నాయకులు గుర్తుంచుకోవాల్సిన విషయం ఒకటి ఉందన్నారు. రాచర్ల మండలం రామన్నకుత్తువ వద్ద నుంచి గిద్దలూరు వరకు నీటి సప్లయి కోసం కొన్న పైపులు నిరుపయోగంగా అలాగే పడి ఉన్నాయని గుర్తు చేశారు. ప్రజాధనం దుర్వినియోగం చేయడంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలోనే ఎక్కువ జరిగిందన్నారు. ప్రజల సమస్యలను వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం సమర్థంగా పరిష్కరిస్తుందని గుర్తుంచుకోవాలన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

కొమరోలు: మండల కేంద్రంలోని 40 మంది ఎస్టీ నిరుపేద కుటుంబాలకు చర్చ్ ఆఫ్ క్రైస్ట్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు గుర్రం శరత్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవారిని ఆదుకోవడం అదృష్టంగా భావించి దుప్పట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఉన్నతంగా ఆలోచిస్తున్న ఆపదలో ఉన్న వారిని ఆదుకునేలా ప్రయత్నించాలన్నారు. దైవసేవకులు సీదర్ల మోహన్, ఇల్లూరి జీవారత్నం పాల్గొన్నారు.

దివ్యాంగుల పాఠశాలకు ఫ్యాన్లు వితరణ



మార్కాపురం: మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మేడా లక్ష్మీదేవి జ్ఞాపకార్థం రాష్ట్ర ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ డైరెక్టర్ మేడా వెంకట బద్రీనాథ్, హరికృష్ణ, శ్రీనివాసకుమార్ స్థానిక మానసిక దివ్యాంగుల పాఠశాలకు బుధవారం ఫ్యాన్లు బహుకరించారు. పాఠశాలలో విద్యార్థులు ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న విషయాన్ని నిర్వాహకులు తెలియజేయడంతో ఫ్యాన్లు అందించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారికి ప్రిన్సిపాల్ భాను, కరస్పాండెంట్ కాశిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యత

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



చెన్నరాయునిపల్లి జగనన్న లేఔట్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం టౌన్: జగనన్న కాలనీల్లో మౌలిక వసతులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, లబ్ధిదారులు త్వరగా ఇళ్లు నిర్మించుకోవాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సూచించారు. బుధవారం ఆయన చెన్నరాయునిపల్లి సమీపంలోని జగనన్న కాలనీ, ఇడుపూరు లేఔట్లను మున్సిపల్, హౌసింగ్, ఎలక్ట్రికల్ అధికారులు, కౌన్సిలర్లతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జగనన్న కాలనీల్లో తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. చెన్నరాయునిపల్లి లేఔట్‌లో పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ.. డీప్ బోర్లు వేసి వాటర్ ట్యాంకులు నిర్మించాలని కోరగా.. నాలుగు బోర్లు వేసి ట్యాంకులు నిర్మించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. లేఔట్‌లో మొత్తం 1240 మందికి ఇంటి పట్టాలు ఇవ్వగా, ఇప్పటికే 800 మంది ఇళ్లు కట్టుకుంటున్నారని హౌసింగ్ డీఈ పవన్‌కుమార్ ఎమ్మెల్యేకు వివరించారు. విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నామని ఏడీఈ షియా నాయక్ తెలిపారు. కాలనీల్లో అవసరమైన రోడ్లు వేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, కౌన్సిలర్లు, ఇన్‌చార్జిలు ఉత్తమ కుమార్, కరీంబాషా, రంగయ్య, ఏఈ ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు



ఎమ్మెల్యే అన్నాను ఆహ్వానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మార్కాపురం: కృష్ణాష్టమి పర్వదినాన్ని బుధవారం మార్కాపురం మండల ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఉదయం నుంచే పలు ఆలయాల్లో హరే రామ హరే కృష్ణ ఏకాహం నిర్వహించారు. శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం, వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వాసవీ విద్యానికేతన్‌లో కృష్ణాష్టమి వేడుకలను డైరెక్టర్ రంగయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పలువురు చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణతో అలరించారు. ఉట్టికొట్టే కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

కంభం: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో మండలంలోని తురిమెళ్ల, అర్ధవీడు మండలంలోని కాకర్ల గ్రామంలో శ్రీక్రిష్ణాష్టమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం- ప్రబోధ సేవా సమితి సభ్యులు ఆజాద్, రమేష్, శేఖర్, లక్ష్మీదేవి, సుభాషిణి, వెంకటేష్ పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకలకు ఎమ్మెల్యే అన్నాకు ఆహ్వానం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబును బుధవారం కలిసి మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించబోయే సంప్రదాయ కార్యక్రమాల్లో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొంది తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఓ.వెంకటయ్య, సభ్యులు బాలగురవయ్య, రమేష్, మొర్రి పిచ్చయ్య యాదవ్ పాల్గొన్నారు.



గీతామందిరంలో పూజలందుకుంటున్న కృష్ణస్వామి మూలవిరాట్

యర్రగొండపాలెం: కృష్ణాష్టమి సందర్భంగా స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బుధవారం ప్రత్యేకాలంకరణో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి భక్తులు స్నాన సంధ్యలు వార్చుకొని పట్టణానికి 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న మిల్లంపల్లి వేణుగోపాలస్వామి ఆలయానికి చేరుకొని పూజలు చేశారు. కృష్ణాష్టమి సందర్భంగా వర్షాలు కురుస్తాయన్న భక్తుల నమ్మకాన్ని స్వామివారు నెరవేర్చారు. ఈ సందర్భంగా ఉట్ల స్థంభాల వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమం సనాతనంగా ఆచరిస్తువస్తున్నారు. పండగ రోజు గ్రామంలో ఒక సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందడంతో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు ఆ దేవస్థానం కమిటీ చైర్మన్ యక్కలి భాగ్యారావు తెలిపారు.



తురిమెళ్ల గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు

కురిచేడు: స్థానిక వాసవీకన్యకాపరమేశ్వరీదేవి ఆలయ ఆవరణలోని శ్రీకృష్ణస్వామి సన్నిధిలో బుధవారం కృష్ణాష్టమి ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఆలయ పూజారి నారాయణం వెంకటేశ్వర్లు, శ్రీ కృష్ణపీఠం కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. ఈ నెల 13వ తేదీ వరకు నిర్వహించే ఉత్సవాల్లో తొలిరోజు అయిన బుధవారం ఉదయం వేదపఠనంతో ఆలయ ప్రదక్షిణ, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, అఖండజ్యోతి స్థాపన, హనుమాన్‌జండాస్థాపనం, ఋత్విగరణము, మండపారాధనము, కలశస్థాపన, గోపూజ, శ్రీ సిద్ధిబుద్ధి సమేత గణపతి దేవుల కళ్యాణం, మహిళా సంఘంచే గీతాపారాయణం, సహస్రనామ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



భక్తులకు దర్శనం ఇస్తున్న వేణుగోపాలస్వామి

సమాజ నిర్దేశకులు ఉపాధ్యాయులు

- ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ శ్రీనివాసరావు



ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్‌ను సన్మానిస్తున్న సాధన కళాశాల సిబ్బంది

మార్కాపురం టౌన్: సమాజంలోని అన్ని రంగాలు వైజ్ఞానిక దృక్పథంతో అభివృద్ధి చెందడానికి ఉపాధ్యాయుల పాత్ర కీలకమని మార్కాపురం ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ మిరియాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక సాధనా డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ మాట్లాడుతూ.. నైతిక విలువలు, క్రమశిక్షణతో కూడిన విద్య బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అధ్యాపకులు అంకితభావంతో పనిచేస్తే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ కె మధుసూధన శాస్త్రి ఆధ్వర్యంలో శ్రీనివాసరావుతోపాటు అధ్యాపకుడు వై.శ్రీనివాసులును సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్‌కుమార్, కంప్యూటర్ సైన్సు హెచ్‌ఓడీ కె.పవన్‌కుమార్, కళాశాల సెక్రటరీ రాజగోపాలరెడ్డి, డైరెక్టర్లు ఎంవీ కృష్ణారెడ్డి, వీఆర్‌కే ప్రసాద్, వెన్నా కృష్ణారెడ్డి, జీఎల్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ ఆధ్వర్యంలో..

స్టేట్ టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈఓలు టి.శ్రీనివాసులు, ఎస్‌వీ సుబ్రమహ్మణ్యం, పి.శ్రీనివాసులు తదితరులు హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోషియేషన్ అధ్యక్షుడు టి.ఎర్రయ్య, జిల్లా కన్వీనర్ మండ్లా రామాంజనేయులు, జిల్లా ప్రచార కార్యదర్శి అక్కల నారాయణ, సభ్యులు పాల్గొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు.

ఎస్సీ వర్గీకరణకు మద్దతివ్వాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మార్కాపురం: ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలపాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం రాత్రి ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ నెలలో నిర్వహించనున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణమాదిగ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పందీటి కాశీరావు, ఆదిమూలపు ప్రకాష్, బూదాల సురేష్, ఎస్.కుమార్, జోసెఫ్, ఎం.వరప్రసాద్, చంటి తదితరులు పాల్గొన్నారు.

శిద్దా సుధీర్‌కు అభినందనలు



శిద్దా సుధీర్‌కు అభినందనలు తెలుపుతున్న ముండ్లమూరు మండల ఆర్యవైశ్య సంఘ నాయకులు

ఒంగోలు: టీటీడీ బోర్డు మెంబర్‌గా బాధ్యతలు స్వీకరించిన శిద్దా సుధీర్‌కుమార్‌ను ముండ్లమూరు మండలం ఆర్యవైశ్య సంఘ నాయకులు బుధవారం స్థానిక శిద్దా సుధీర్ నివాసంలో కలుసుకుని అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పులికొండ శ్రీనివాసరావు, అమరా శ్రీరామమూర్తి, శిఖాకొల్లి సుబ్బారావు, పులికొండ బ్రహ్మేశ్వరరావు, అమరా సురేష్, నరహరి నారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి చేరాలి



బహుమతులు అందజేస్తున్న రిమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ సుధాకర్

ఒంగోలు సెంట్రల్: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి చేరాలని రిమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ సుధాకర్ పిలుపునిచ్చారు. జాహ్నవి నీట్ అకాడమీ ఫ్రెషర్స్ డే వేడుకలను బుధవారం స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో అకాడమీ డైరెక్టర్ పి.జనార్దన్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రిమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు ఆరోగ్యం కాపాడుకుంటూ మానసిక ఉల్లాసం కోసం క్రీడల్లో కూడా పాల్గొనాలని కోరారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోషియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జూలాది మణిబాబు, ప్రిన్సిపాల్ చిత్ర, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ ఉత్సవం



పూజల్లో ఎమ్మెల్యే కేపీ కుటుంబ సభ్యులు

మార్కాపురం రూరల్: మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి స్వగ్రామమైన కొండేపల్లిలో పోలేరమ్మ ఉత్సవాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విగ్రహ మూర్తులకు పంచామృత అభిషేకం చేశారు. మహిళలు కుంకుమార్చన నిర్వహించారు. పూజల్లో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి, కుటుంబ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు కుందురు వెంకటరెడ్డి, కొలగట్ల వెంకటరెడ్డి, గంటా చిన్న వెంకటేశ్వరరెడ్డి, శింగా లక్ష్మిరెడ్డి, కుందురు విష్ణువర్ధన్‌రెడ్డి, దొండేటి వెంకటరెడ్డి, గంటా వెంకట ముసలారెడ్డి, కొలగట్ల శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముందుగా గ్రామస్తులు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి ఘన స్వాగతం పలికారు.



కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

వివిధ పుణ్యక్షేత్రాల మట్టి సేకరణ



వల్లూరమ్మ ఆలయం వద్ద మట్టి సేకరిస్తున్న బీజేపీ మహిళలు

ఒంగోలు సెంట్రల్: బీజేపీ ప్రకాశం జిల్లా కార్యదర్శి తీగల సత్యవతి ఆధ్వర్యంలో ఆ పార్టీ చేపట్టిన నా మట్టి–నా దేశం కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రముఖ పుణ్యక్షేత్రం వల్లూరమ్మ దేవస్థానం వద్ద మట్టి సేకరించారు. అనంతరం బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల గురించి వల్లూరు గ్రామంలోని ప్రజలకు వివరించారు. అదే విధంగా భద్రాచలం, భద్రకాళి అమ్మవారు, పెద్దమ్మ గుడిని సందర్శించి మన్ను సేకరించినట్లు చెప్పారు. అన్ని దేవాలయాల మన్నును పార్టీ జిల్లా కార్యాలయానికి చేర్చనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షురాలు జజ్జర క్రిష్ణవేణి, మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు లింగంగుంట వనజ, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ఒంగోలు సెంట్రల్: కళాశాల విద్యార్థినులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్థానిక ఉపాస్ హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ జ్యోత్స్న సూచించారు. స్థానిక పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు రుతుక్రమ పరిశుభ్రత, అపోహలు, వాస్తవాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ జ్యోత్స్న పాల్గొని మాట్లాడుతూ విద్యార్థినులు పౌష్టికాహారం తీసుకుని రక్తహీనత రాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. ముఖ్యంగా నెలవారీ పీరియడ్స్ సమయంలో తీసుకోవాల్సిన ప్రత్యేక జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం డాక్టర్ జ్యోత్స్నను సన్మానించారు. కార్యక్రమంలో పేస్ కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే మూర్తి, మహిళా విభాగం కన్వీనర్ వైష్ణవి, కళాశాల హెల్త్ వాచ్ కమిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.బ్రహ్మం, వైద్య సిబ్బంది ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకు ఉపాధి కల్పించాలి

ఉలవపాడు: రామాయపట్నం పోర్టులో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డీవైయఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ అన్నారు. ఉలవపాడులో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ జీబుజాతాను ఉద్దేశించి బుధవారం ఆయన మాట్లాడారు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉలవపాడులో ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పించాలని కోరారు. విద్యార్థులకు కాస్మోటిక్, మెస్ ఛార్జీలు పెంచాలని కోరారు. ముందుగా హైస్కూల్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కుమార్, ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీనివాసులు, నరేంద్ర, అజయ్, చైతన్య, నరశింహ తదితరులు పాల్గొన్నారు.

పగిలిన కనిగిరి సాగర్ పైప్‌లైన్

- తక్షణ మరమ్మతులు చేపట్టిన అధికారులు
- రెండు రోజుల్లో యధావిధిగా నీరు సరఫరా చేస్తాం: కమిషనర్



పగిలిన సాగర్‌లైన్‌ను మరమ్మతులు చేస్తున్న వాటర్ లైన్ సిబ్బంది

కనిగిరి రూరల్: దర్శి ఎస్ఎస్ (సమ్మర్ స్టోరేజ్) ట్యాంక్ వద్ద జరుగుతున్న పనుల ప్రక్రియల్లో కనిగిరికి సాగర్ జలాలు సరఫరా జరిగే పైప్‌లైన్ పగిలింది. దీంతో బుధవారం కనిగిరిలో సాగర్ జలాలు నిలిచాయి. ప్రతి రోజు దర్శిలో ఉన్న కనిగిరి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుంచి కనిగిరికి సుమారు 4 లక్షల లీటర్ల సాగర్ జలాలు సరఫరా అవుతాయి. దర్శిలో ఉన్న కనిగిరి ఎస్ఎస్ ట్యాంక్ ప్రధాన పైప్‌లైన్ మరమ్మతులకు గురి కావడంతో సాగర్ నీరు పంపింగ్ నిలిచింది. పగిలిన పైప్‌లైన్ లీకేజీ ప్రదేశాలను వాటర్ లైన్ సిబ్బంది గుర్తించారు. ఈమేరకు మున్సిపల్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణలో తక్షణ మరమ్మతుల పనులు ప్రారంభించారు. రెండ్రోజుల్లో మరమ్మతులు పూర్తవుతాయని, శనివారానికి సాగర్ నీరు యధావిధిగా కనిగిరి ప్రజలకు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ డీవీఎస్ నారాయణరావు పేర్కొన్నారు.

రజియాను పరామర్శించిన ముస్లిం నాయకులు

ఒంగోలు టౌన్: మహిళా దొంగల దాడిలో గాయపడిన బ్యూటీషియన్ షేక్ రజియాను ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి ప్రతినిధులు పరామర్శించారు. బుధవారం రజియా ఇంటికి చేరుకున్న ఎంహెచ్‌పీఎస్ నాయకులు ఎండీ నిజాం, షేక్ షెహనాజ్, ఆరీఫ్, రియాజ్, ఇమామ్ తదితరులు పరామర్శించి ధైర్యం చెప్పారు.